నెల రోజులుగా తగ్గని వరద

నీటిలోనే నానుతున్న రోడ్లు


- పల్లెవాడ రైల్వే స్టేషన్‌కు చేరడం ఎలా?
- నరకం చూస్తున్న ప్రయాణికులు
- రైల్వేట్రాక్ మధ్య బోదె పూడుకుపోవడమే సమస్య

గత నెల్లో బుడమేరు ప్రభావం, అధిక వర్షాలతో వరదల వచ్చి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైకలూరు మండలం పల్లెవాడ రైల్వేస్టేషన్‌కు చేరే రహదారులు నెల రోజులుగా నీటిలో నానుతున్నాయి. దీంతో పల్లెవాడతో పాటు 10 గ్రామాల ప్రజలు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అయితే ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం.

కైకలూరు: గతంలో లోతట్టు ప్రాంతమైన పల్లెవాడ రైల్వేస్టేషన్ వద్ద చేరిన నీరు ట్రాక్ అడుగు నుంచి పుల్లవ డ్రెయిన్‌కు చేరేది. దీంతో వచ్చిన నీరు కిందకు వెళ్లేది. ఇటీవల రైల్వేట్రాక్ డబుల్ లైన్ ఏర్పాటు చేశారు. రైల్వేశాఖ అధికారులు తూములు ఏర్పాటు చేసినా నీటిని పంపించే బోదె పూడుకుపోయింది. దీనిపై పలు సందర్భాల్లో గ్రామస్తులు రైల్వే అధికారులకు విన్నవించుకున్నా బోదె ఏర్పాటుకు అనుమతులు లేవని చెప్పారు. దీంతో నీటి పారుదల లేక రోడ్లపైనే వర్షం నీరు నిల్వచేరింది. ఆ నీరు దుర్వాసన వెదజల్లుతోంది.

10 గ్రామాల ప్రజలు అవస్థలు

పల్లెవాడ సమీప 10 గ్రామాల ప్రజలు ఈ గ్రామ రైల్వేస్టేషన్ నుంచి విజయవాడ, నరసాపురం రూట్లలో ప్రయాణిస్తుంటారు. పల్లెవాడ స్టేషన్ నుంచి నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కైకలూరు రైల్వేస్టేషన్‌కు 10 కిలోమీటర్లు, సమీప ఆకివీడు రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీంతో నర్సాయిపాలెం, దొడ్డిపట్ల, ఆలపాడు, పంచికలమర్రు, పెద రామవరం తదితర గ్రామాల ప్రజలు పల్లెవాడ రైల్వే స్టేషన్ నుంచి రోజూ ప్రయాణాలు సాగిస్తుంటారు. పల్లెవాడ రైల్వేస్టేషన్ చేరడానికి నాలుగు మార్గాలు ఉన్నప్పటికీ చివరికి వచ్చేసరికి నీటిలో నడవాల్సి వస్తోంది. రైల్వే అధికారులు పంచాయతీతో కలసి బోదె ఏర్పాటునకు కృషి చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.


పల్లెవాడ నుంచి రైల్వేస్టేషన్‌కు చేరే రోడ్డు నెల రోజులుగా నీటిలోనే మునిగి ఉన్న దృశ్యం


పల్లెవాడ రైల్వేస్టేషన్ చేరడానికి ప్రయాణికుల ఇక్కట్లు


పల్లెవాడ రైల్వేస్టేషన్‌లో నిలిచి ఉన్న రైలు

డబుల్ లైన్ వేసిన తర్వాతే సమస్య



మా పూర్వం నుంచి రైల్వేస్టేషన్ పట్టాలు కింద నుంచి వర్షం నీరు అవతల పుల్లవ డ్రెయిన్‌కు బోదె ద్వారా చేరేది. రైల్వే డబుల్ లైన్ వేసిన తర్వాత సమస్య ఉత్పన్నం అయింది. ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పల్లెవాడ రైల్వేస్టేషన్‌లో గతంలో స్టాప్ కలిగిన రెండు పాసింజర్ రైళ్లకు స్టాప్ తీసివేశారు. అధికారులు తిరిగి వాటిని పునరుద్ధరించాలి.

– అడపా పార్థసారథి, మాజీ వార్డు సభ్యుడు, పల్లెవాడ

రైల్వే అధికారులు స్పందించాలి



రైల్వే స్టేషన్ చేరడానికి ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదు. డబుల్ ట్రాక్ ఏర్పాటు చేసిన తర్వాత నీటి పారుదలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు వెంటనే స్పందించి ట్రాక్ వరకు బోదె తవ్వకానికి అనుమతించాలి. అదేవిధంగా రెండు రైళ్ల స్టాప్‌ను అధికారులు పునరుద్ధరించాలి.

– గూడపాటి మోహనరావు, పల్లెవాడ

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

కైకలూరు: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్టు కైకలూరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి వెంకటరత్నమ్మ బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 27న నిర్వహించే టెట్ స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించాలని పేర్కొన్నారు. ప్రముఖ కోచింగ్ సెంటర్లలో శిక్షణ అందిస్తామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21లోపు సాంఘిక సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98499 03591 సెల్‌లో సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ



అడ్డాడ(పామర్రు): గ్రామంలో అరవింద హైస్కూల్లో దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్ ప్రారంభించామని ప్రిన్సిపాల్ ఎస్.రమణమూర్తి పేర్కొన్నారు. దాతల సహకారంతో ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్వో ప్లాంట్ వలన విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. రాజు వేగేసిన, జయప్రద ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌ను బహూకరించారు. తొలుత పాఠశాల కరెస్పాండెంట్ నాగార్జునరాజు, సూర్యనారాయణమూర్తి ప్లాంట్‌ను ప్రారంభించారు.

సేద్యం సాగు లాభసాటి కావాలి



ముదినేపల్లి రూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ సేద్యాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ లలితాసుధా, మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని గురజ, పెనుమల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూసారాన్ని కోల్పోతున్న ప్రస్తుత తరుణంలో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జీవామృతం తయారీ విధానాన్ని గౌతమ్‌కుమార్ రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. మండల వెటర్నరీ డాక్టర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం


గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి కె.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టిడ్కో కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కావున పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



నిమ్మకూరు(పామర్రు): పాఠశాలల ప్రాథమిక అవసరాల కోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ప్రసాదరావు, ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ సురేష్, ఏపీఎం తిరపతిరావు, ఏఈపీఆర్ రామారావు పాల్గొన్నారు.

విజయకుమారి సేవలు ఆదర్శనీయం



గుడ్లవల్లేరు: మానసిక దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందించటంలో 18ఏళ్లగా కృషి చేసిన ఐఈఆర్‌టీ వి.విజయకుమారి సేవలు ఆదర్శనీయమని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు కొనియాడారు. గుడ్లవల్లేరు భవిత కేంద్రం నుంచి మండవల్లి జెడ్పీ హైస్కూల్లోని స్పెషల్ ఎడ్యుకేషన్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీ అయిన విజయకుమారిని ఎంఈఓలు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యాలయ సిబ్బంది, సీఆర్‌ఎంటీలు మాధవరావు, పరమేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పునః ప్రారంభం



గుడ్లవల్లేరు: కౌతవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ మరమ్మతుల పనులు పూర్తయ్యి పునః ప్రారంభానికి సిద్ధమైంది. రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో మరమ్మతులు చేయించినట్లు సబ్ రిజిస్ట్రార్ ఎస్.మధుబాబు పేర్కొన్నారు. గురువారం ఈ కార్యాలయాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: చెన్నైలో ఈనెల 6వ తేదీన జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎన్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్లో విజేతలను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-12, అండర్-14 బాలురు, బాలికల కటా విభాగంలో ఎం.పవన్‌కుమార్, ఎ.రాకేష్, డి.భవన శ్రీజ, మణికంఠ, సాయి కార్తికేయ తదితరులు ద్వితీయ స్థానం సాధించి విజేతలుగా నిలిచారన్నారు. అదేవిధంగా బి.లోహిత్ తృతీయ స్థానంలో గెలుపొందారన్నారు. వెండి, కాంస్య పతకాలను ప్రశంసా పత్రాలను సాధించారని తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టండి


చెత్తకుప్పను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పారిశుద్ధ్య సమస్యలపై దృష్టిపెట్టకుంటే చర్యలు తప్పవని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పట్టణంలో చెత్తకుప్పలు పడిఉండటాన్ని బుధవారం గమనించి ఉద్యోగులకు హెచ్చరికలు జారీచేశారు. ఉద్యోగుల తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చెత్త కుప్పలు పేరుకుపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పట్టణాను పరిశుభ్రంగా ఉంచాలని తాను ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ విధమైన వాతావరణం కలిగి ఉండటం ఇబ్బందికరం అన్నారు.

రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. వైద్యుల సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషంట్లకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి పరిశీలించారు. ఆహారంలో నాణ్యతా లోపాలు ఉన్నాయని గుర్తించి ఫుడ్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి హెచ్చరికలు జారీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

కోదండ రామాలయ పునఃప్రతిష్ట


తామరకొల్లు రామాలయంలో పూజలు చేస్తున్న డీఎన్నార్

కైకలూరు: రామనామస్మరణతో తామరకొల్లు గ్రామం బుధవారం మార్మోగింది. కోదండ రామాలయ పునఃప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్రాజు శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు బోడావుల అప్పయ్య, మీగడ బాబీ, బుర్ల వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే మందుబాబులకు చుక్కలు

- పూర్తిగా తెరుచుకోని మద్యం దుకాణాలు
- పాత రేట్లకే విక్రయాలు

కైకలూరు: మద్యం ప్రియులకు నూతన ప్రైవేటు దుకాణదారులు మొదటి రోజే చుక్కలు చూపారు. కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 21 మద్యం దుకాణాలకు అనుమతులు వచ్చాయి. వాటిలో ఎనిమిది దుకాణాలను బుధవారం ప్రారంభించారు. వీటిలో అధిక శాతం సాయంత్రం నుంచి విక్రయాలు ప్రారంభించారు. పాత ప్రభుత్వ దుకాణాలను మంగళవారం రాత్రి నుంచి మూసివేసి, మద్యం సీసాలను అధికారులకు అప్పగించారు. లైసెన్సుదారులు వారం రోజులకు సరిపడా మద్యం నిల్వల కోసం ఏపీఎస్‌బీసీఎల్‌కు ఆర్డర్లు పెట్టారు. ఆర్డర్ల కోసం ఎక్సైజ్ శాఖ లైసెన్సుదారులకు ప్రత్యేకంగా లాగిన్ ఐడీలను ఇచ్చింది. కైకలూరు నియోజకవర్గానికి గుడివాడ డిపో నుంచి మద్యం సీసాలు తీసుకురావాల్సి ఉంది. ఒక్కసారిగా డిపో పరిధిలో అనేక లైసెన్సుదారులు వెళ్లడంతో పంపిణీ ఆలస్యమైంది. ఉదయం నుంచి మద్యం దుకాణాలు తెరవపోవడంతో మందుబాబులు వేచి చూశారు. సాయంత్రం తెరిచిన మద్యం దుకాణాల వద్ద పెద్ద జాతర మాదిరిగా మందుబాబు ఎగబడి బారులుతీరారు. రోడ్డు సమీప మద్యం దుకాణాల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇదిలా ఉంటే మద్యం ధరలు ఏ మాత్రం తగ్గలేదని పలువురు తెలిపారు. కొత్త మద్యం షాపుల్లో తక్కువ ధరకు మందు దొరకుతుందని ఆశగా వచ్చిన మందు బాబులు నిరాశ చెందారు. గురువారానికి అన్ని మద్యం దుకాణాలు తెరుచుకుంటాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

చెరువు కాదు.. రోడ్డు


రోడ్డుపై పడిన భారీ గుంతలతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నివాసానికి కూతవేటు దూరంలో రహదారి పెద్ద తటాకంలా మారింది. వరహాపట్నం నుంచి ఆరుతెగుళ్లపాడు చేరే రహదారిలో దమ్మిడి డ్రెయిన్‌లో నీటి పారుదల లేక ఈ పరిస్థితి ఏర్పడింది. నెలల తరబడి నీరు నిల్వ కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు నీటి గుంతల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. సమీపంలోని ఆరుతెగుళ్లపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డుపై గుంతకు మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- కైకలూరు

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

మార్కెటింగ్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కువ


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రమేష్

గుడివాడ టౌన్: ఎంబీఏ విద్యార్థులకు మార్కెటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విజయవాడ కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్. రమేష్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎంబీఏ విద్యార్థులకు బుధవారం మార్కెటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని వ్యాపారాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిరోజూ వార్తా పత్రికలు చదవడం వలన స్టాక్ ఎక్స్ఛేంజ్ లావాదేవీలు పరిశీలించడం ద్వారా వివిధ వ్యాపారాలపై పట్టు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడీ ఎంబీ సువర్చల పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ వెంబడి గ్రీన్ క్లాత్ ఏర్పాటు



మండవల్లి: మండవల్లిలో జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలను తొలగించి బుధవారం గ్రీన్ క్లాత్‌ను సర్పంచ్ మెండా ఝాన్సీ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ శాఖ సహాయ సహకారాలు అందజేశారు. కార్యదర్శి కొండలు పంచాయతీ సిబ్బందితో గ్రీన్ క్లాత్ కట్టించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడం సంతోషం


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల: పల్లెల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని ఉచితంగా అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని హనుమంతపురంలో లింగమనేని యూత్ ఆధ్వర్యంలో రూ.13 లక్షల వ్యయంతో మండవ సుబ్బారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావుతో కలిసి ప్రారంభించారు. దాతలు మండవ వెంకటేశ్వరరావు, లింగమనేని వెంకట్రామయ్య పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లో నీరు లేకుండా చేయండి

పమిడిముక్కల: తాడంకి అండర్‌పాస్ వద్ద మురుగునీరు నిల్వలేకుండా చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. తాడంకి అండర్‌పాస్ వద్ద మురుగునీరు పోయేందుకు అవకాశం లేకపోవడంతో రోజుల తరబడి మురుగునీరు నిలిచి ఉంటోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఈ సమస్యను ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నేషనల్ హైవే అథారిటీ పీడీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి బుధవారం అండర్‌పాస్‌ను పరిశీలించారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ


ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: మ్యాథమేటిక్స్ టీచర్స్ అసోసియేషన్(ఇండియా) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మ్యాథమేటిక్స్ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు 12 మంది విజయం సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 8వ తేదీన నిర్వహించిన ఈ పోటీ పరీక్షల్లో పి. నవదీప్, సీహెచ్. ఉజ్వల్‌రామ్, పి. బిందుభార్గవి, వి. వెంకటకౌశిక్‌రెడ్డి, జి. జయఅభిరామ్, డి.వ్యాగ్రిష్ చౌదరి, బి. గురుదీపక్ రెడ్డి, ఎంవీ. భవ్యతేజ, వి.హేమసాయి సిద్ధార్థ, ఎం.నీరజ్‌కుమార్, డి.రిషితరెడ్డి, కె.ప్రేమ్‌చంద్ మొత్తం 12 మంది ఉత్తీర్ణత సాధించి నవంబర్ 3వ తేదీ జరిగే రెండవ స్థాయి పోటీపరీక్షలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతిభను ప్రదర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను యాజమాన్యం బుధవారం అభినందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

నందివాడ: మండలంలోని పెదలింగాల, చినలింగాల, పుట్టగుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. అనంతరం రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిన్నమనేని బాబ్జి, మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఎంపీడీఓ మల్లీశ్వరి, నాయకులు చేకూరు జగన్మోహన్‌రావు, యలమంచిలి సతీష్, చాట్రగడ్డ రవి, నంబూరి రాకేష్, యార్లగడ్డ రవి, సర్పంచ్ కలపాల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో బుధవారం నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పల్లె పండుగ వారోత్సవాలు పురస్కరించుకుని భూమి పూజలు నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, ముళ్ళపూడి సత్తిబాబు, మాజీ సర్పంచ్‌లు గుడివాడ చిట్టిబాబు, నారగాని నాగేశ్వరరావు, సత్యనారాయణరాజులు, గుడివాడ మురళీ, మారగాని చిన్న తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీరంతా రోడ్డుపైనే..



మొవ్వ: మండలంలోని రహదారులు కొద్దిపాటి వర్షానికే కాలువల్లా మారుతున్నాయి. ప్రధానంగా మొవ్వ మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి గ్రామానికి వెళ్లాలంటే దేవుడు కనిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొవ్వ నుంచి పెదముత్తేవి వెళ్లే రహదారి, కారకంపాడు నుంచి పెదముత్తేవి వెళ్లే రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. రోడ్డు పై పెద్ద పెద్ద గుంతలు ఏర్పటంతో చిన్నపాటి వర్షానికే నీటి సంద్రాలను తలపిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. ఈ రహదారులకు త్వరితగతిన మరమ్మతులు పనులు చేపట్టాలని పెదముత్తేవి, కొండవరం గ్రామ ప్రజలు కోరుతున్నారు.